సాక్షి సిద్దిపేట

సోమవారం। 25। ఆగస్టు। 2025



గణేశ్ లైటింగ్.. ట్రెండింగ్

యూత్ సభ్యులు వినాయక మండపాలను ఆకర్శణీయంగా తీర్చిదిద్దుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వివరాలు 8లో ▸



ఆదుకోని పెసర

భారీ వర్షాలతో పెసర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



పశువైద్యంపై పట్టింపేదీ?

పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

సిద్దిపేటకమాన్: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజు పోరాట సమితి (టీఎంపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో పల్లె బాట నిర్వహించామన్నారు. ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. 57ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్లు కేటాయించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలన్నారు.కార్యక్రమంలో అశోక్, సీవన్, రమేశ్, రంజిత్, శేఖర్, శ్రీశైలం, నరేశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్



మాట్లాడుతున్న పరమేశ్వర్

సిద్దిపేటజోన్: జిల్లాలో ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పబ్లిక్ సర్వెంట్స్ హోంలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో వారు పాల్గొన్నారు. కష్టపడి పని చేయాలని, అధికారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి, కార్యదర్శిగా కనకరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేందర్, కోశాధికారిగా జహంగీర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు అశ్వాక్, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచేవరకు పోరాటం



మాట్లాడుతున్న మంద కుమార్

గజ్వేల్: దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్ డబ్బులను పెంచేవరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ అన్నారు. వచ్చే నెల 9న సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న పెన్షన్‌దారుల 'మహా గర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో పెన్షన్‌దారుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంద కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా వృద్ధుల పెన్షన్ రూ.4వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 'మహా గర్జన'కు పెన్షన్‌దారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాములుమాదిగ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమం పట్టని సర్కార్

మిరుదొడ్డి(దుబ్బాక): వికలాంగుల సంక్షేమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు విమర్శించారు. ఆదివారం మిరుదొడ్డిలో వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) సీహెచ్‌పీఎస్ (చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి) సంయుక్త ఆధ్వర్యంలో వికలాంగుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్తగా దరఖాస్తులు చేసుకున్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. లేదంటే రాష్ట్రంలో ఉన్న 45 లక్షల పెన్షన్‌దారులు రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయకతప్పదన్నారు. వచ్చే నెల 9న సికింద్రాబాద్‌లో తలపెట్టిన వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహా గర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి రాజేశ్వర్ రావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శాంతికుమార్, నాయకులు రాములు, రాజనర్సు, అంజయ్య, వెంకటేశం, ఎల్లయ్య, మల్లయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మర్కూక్ మండలంలో కనువిందు చేస్తున్న పచ్చని అందాలు

పచ్చని అందాలు.. ప్రకృతి సోయగాలు

చుట్టూ పచ్చని చెట్లు.. మధ్యలో వ్యవసాయ పొలాలు.. పక్కనే కొండపోచమ్మ సాగర్ అందాలు.. పర్యాటకులకు కనువిందు చేస్తూ ప్రకృతి రమణీయతను చాటుతున్నాయి. కొండపోచమ్మ సాగర్ పక్కనే ఉండటంతో భూమికి పచ్చని రంగేసినట్లు కనిపిస్తున్నాయి. పచ్చని అందాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – మర్కూక్(గజ్వేల్)

చెరువుల్లోకి చేపొచ్చేనా?



పూర్తిస్థాయిలో పంపిణీ జరిగేనా..

- వచ్చే నెల ఒకటో తేదీతో ముగియనున్న ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణ
- జిల్లాలో 1,715 చెరువులు
- 4.42కోట్ల చేప పిల్లల సరఫరా లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 379 మత్స్యకార సొసైటీలు.. 24,517 మంది సభ్యులు

ఈసారైనా సకాలంలో చేపల పంపిణీ పూర్తి స్థాయిలో జరుగుతుందా? లేదా అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కసరత్తు చేస్తుండటంతో మత్స్యకారుల్లో ఒక వైపు ఆనందం మరోవైపు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ఉచితంగా చేపల పంపిణీ పూర్తి స్థాయిలో జరగలేదు. 2.21కోట్ల చేప పిల్లల పంపిణీ చేయాల్సిండగా కేవలం 25 చెరువుల్లో 12.34లక్షల చేప పిల్లలు మాత్రమే సరఫరా చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకొన్నారు. ఈ సంవత్సరమైనా క్షేత్రస్థాయిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి, ఎంత వరకు కాంట్రాక్టర్ సరఫరా చేస్తారో అధికారులు అంచనా వేసిన తరువాతే టెండర్లు అప్పగించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా చేపల పంపిణీకి మత్స్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 1,715 చెరువుల్లో 4.42కోట్ల చేప పిల్లలను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ల ఎంపిక కోసం సెప్టెంబర్ 1న టెండర్లు స్వీకరించనున్నారు.

– సాక్షి, సిద్దిపేట

1న టెండర్లు ఓపెన్

చేప పిల్లల పంపిణీ చేసేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి కాంట్రాక్టర్ల నుంచి టెండర్లను స్వీకరిస్తున్నారు. వచ్చే నెల 1న మధ్యాహ్నం 3గంటల వరకు ఆన్‌లైన్‌లో టెండర్ల స్వీకరించనున్నారు. జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఆధ్వర్యంలో అదే రోజు మధ్యాహ్నం 3:30గంటలకు టెండర్లు ఓపెన్ చేయనున్నారు. టెక్నికల్ ఆమోదం కోసం అన్ని అనుమతులు, ఫీడ్ కోసం భూమి సర్వే నంబర్లను పరిశీలించనున్నారు. తర్వాత ఫిజికల్‌గా ఫీడ్ ఫాంను పరిశీలించనున్నారు. తర్వాత ఎవరు ధర తక్కువకు సరఫరా చేస్తారో వారికి కాంట్రాక్ట్‌ను అప్పగించనున్నారు.

జిల్లాలో 379 మత్స్యకార సొసైటీలు ఉండగా 24,517 మంది సభ్యులు ఉన్నారు. అందులో 40 మహిళా సొసైటీలు 1,975 సభ్యులు, పురుషులు 339 సొసైటీలు 22,442 మంది సభ్యులున్నారు. జిల్లా వ్యాప్తంగా 2025–26 సంవత్సరానికి 1,715 చెరువుల్లో ఉచితంగా 4,42,55,335 చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ప్రణాళికలను రూపొందించారు. కట్ల, రవ్వలు, బంగారు తీగలు 35 ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు చేప పిల్లలు. 1,468 చెరువుల్లో 1,78,70,943 చేప పిల్లలు, 80 నుంచి 100 ఎంఎం చేప పిల్లలు 247 చెరువుల్లో 2,63,84,392 చేపలను వదలనున్నారు..

పంపిణీ సామర్థ్యం ఉంటేనే అప్పగించాలి

గత ఏడాది జరిగిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గతంలో కాంట్రాక్టర్‌కు సరఫరా చేసే సామర్థ్యం లేకున్నా ఎంపిక చేయడంతో పూర్తిస్థాయి సరఫరా చేయలేదు. ఈ సంవత్సరమైనా క్షేత్రస్థాయిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి, ఎంత వరకు కాంట్రాక్టర్ సరఫరా చేస్తారో అధికారులు అంచనాలు వేయాలి. గతేడాది మాదిరిగా పునరావృతం కాకుండా చూడాలని మత్స్యకారులు కోరుతున్నారు.

10 నుంచి పంపిణీ



రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి చేప పిల్లల పంపిణీ ప్రారంభం కానుంది. వచ్చే నెల పదో తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. టెండర్లను ఓపెన్ చేసిన తర్వాత పరిశీలించి, చేపపిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ ప్రక్రియ కావాలి. అన్ని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు రూపొందించాం.

–మల్లేశం, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సకాలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- వైద్యాధికారులకు కలెక్టర్ హైమావతి ఆదేశాలు
- తిమ్మాపూర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటన



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ.. తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఇటీవల డెంగీతో మృతి చెందిన శ్రావణ్, మహేశ్‌ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఫీవర్ సర్వేతో పాటు డెంగీ పరీక్షలు నిర్వహించాలని, ఎలాంటి లక్షణాలు కనిపించినా వెంటనే రక్తనమూనాలను టీహబ్‌కు పంపించి సమగ్ర వివరాలు తెలుసుకోవాలన్నారు. నీరు, చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, గ్రామాల్లో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లకుండా ఎలాంటి లక్షణాలున్నా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో అసాధారణ వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ రమేశ్ క్లీనిక్‌ను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, డీఎంహెచ్ఓ ధనరాజ్, ఎంపీడీఓ రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోహెడరూరల్(హుస్నాబాద్): శనిగరం గ్రామంలోని బాలుర వసతి గృహన్ని కలెక్టర్ హైమవతి శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల రిజిస్టర్ పరిశీలించారు. రిజిస్టర్‌లో నమోదైన పిల్లలు వసతి గృహంలో లేకపోవడంతో కలెక్టర్ వార్డెన్‌ను ప్రశ్నించారు. అదివారం సెలవు కావడంతో ఇంటికి వెళ్లారని వార్డెన్ తెలిపారు. ఆనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లు సరిగాలేవని విద్యార్థులు తెలిపారు. సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చిరు.

కొమురవెల్లిలో భక్తుల సందడి



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. స్వామివారిని దర్శించుకున్న అనంతరం పట్నాలు వేసి, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కొండపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి తమ పిల్లపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

విద్యారంగం బలోపేతం చేద్దాం

- ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపు
- గజ్వేల్‌లో టీపీటీఎఫ్ విద్యాసదస్సు
- హాజరైన ప్రొఫెసర్ కాశీం, విమలక్క



విద్యాసదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

గజ్వేల్: ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎల్లయ్య పదవీవిరమణ సందర్భంగా స్థానిక ప్రజ్ఞాగార్డెన్స్‌లో టీపీటీఎఫ్ విద్యాసదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన కోదండరామ్ మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధికి టీపీటీఎఫ్ నిబద్ధతతో పనిచేయాలన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ–పౌర సమాజం పాత్ర' అంశంపై ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సీసీఎస్ విధానం వద్దు అంటూ ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్న తరుణంలో...ఈ విద్యారంగాన్ని ఎలా కాపాడుకోగలమని ప్రశ్నించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రమాణాలతో కూడిన విద్యాబోధన జరుగుతుండగా, ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుకుభిన్నమైన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. ఈ పరిస్థితి మార్చడానికి ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. 'తెలంగాణ సాంస్కృతికోద్యమం–మహిళలు' అంశంపై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడారు. 'తెలంగాణ సాహిత్యోద్యమం–మహిళలు' అంశంపై నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత ప్రసంగించారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ విద్యా సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, అసోసియేట్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

పాపన్న ఆశయాలు సాధిద్దాం

మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్



పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): నాడు కులవృత్తులను ఏకం చేసిన గొప్పవ్యక్తి సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం గోనెపల్లిలో గౌడ సంఘం, కౌండిన్య సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం పోరాటం చేసిన పాపన్న గౌడ్ ఆదర్శనీయుడన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పాపన్న గౌడ్ చరిత్రను పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చామన్నారు. జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సిద్దిపేటజోన్: సాక్షాత్తు పార్వతీదేవి మట్టితో వినాయకుడికి జీవం పోసింది. అలాంటి మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తేనే భక్తి, శక్తి లభిస్తుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ సేవా సమితి సేవలు ఆదర్శంగా ఉన్నాయని కితాబిచ్చారు. మట్టి విగ్రహాన్ని పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడదామన్నారు. ఇటీవల పట్టణంలో ఇష్టానుసారంగా చెట్లను నరుకుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడే బాధ్యత మనందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నాచగిరీశుని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన నాచగిరి క్షేత్రం



నాచగిరిలో స్వామివారు, అమ్మవారు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచారం గుట్ట నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం భక్తజనులతో రద్దీగా మారింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. హల్దీనది వాగులో పుణ్యస్నానాలాచరించారు. గర్భగుడిలో విశేషాలంకృతులై కొలువుదీరిన స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల తాకిడితో క్యూలైన్లు రద్దీగా మారాయి. ఇబ్బంది తలెత్తకుండా ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వీడని బారులు.. తీరని తిప్పలు



నంగునూరు: పాలమాకుల పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు



సిద్దిపేట రూరల్: రాఘవపూర్‌లో రైతుల నిరసన

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలో యూరియా కష్టాలు తొలగడంలేదు. పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన రైతులే కనిపిస్తున్నారు. రోజంతా నిరీక్షించినా అందని దుస్థితి నెలకొంది. నంగునూరు మండలం పాలమాకుల పీఏసీఎస్‌కు ఆదివారం యూరియా వస్తోందని తెలియడంతో తెల్లవారు జామునే చుట్టుపక్కల గ్రామాల రైతులు వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే ఇప్పటి వరకు తీసుకోని వారికి మాత్రమే ఇస్తామని చెప్పడంతో గందరగోళానికి దారి తీసింది. ఆగ్రహించిన కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు.

యూరియా కోసం పడిగాపులు

గొడవ సద్దు మణగడంతో అధికారులు టోకెన్లు పంపిణీ చేశారు. పోలీసుల పహారాలో యూరియా అందజేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఒక బస్తా యూరియాకు మూడు సార్లు క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చిందన్నారు.

పోలీసుల పహారాలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల పహారాలో ఆదివారం యూరియా పంపిణీ చేశారు. రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ, ఏఈఓలతో కలసి ఎస్‌ఐ రాజు, సిబ్బంది పహారాలో రైతులకు టోకన్లు జారీ చేశారు. రైతు సేవా కేంద్రం వద్ద యూరియాను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కావాల్సినంత యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రాఘవపూర్‌లో ధర్నా

సిద్దిపేటరూరల్: సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతూ సిద్దిపేట– ముస్తాబాద్ రహదారిపై ఆదివారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. గంటల తరబడి క్యూ లైన్‌లలో వేచి ఉంటే కొద్ది మందికి మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. పాలకులు స్పందించి కావాల్సిన యూరియా సరఫరా చేయాలన్నారు.

క్లుప్తంగా

మొక్కజొన్నపై అడవి పందుల దాడి



చేనును ధ్వంసం చేసిన పందులు

నిజాంపేట(మెదక్): మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి చేశాయి. వివరాలు ఇలా... మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన పెద్దబోయిన స్వామి తనకున్న ఒక ఎకరాలో మొక్కజొన్న సాగు చేశాడు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. బయటకు వచ్చిన కంకులను అడవి పందులు దాడి చేశాయి. అడవి జంతువుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి రైతు చేను చుట్టూ వల, చీరలు కట్టి.. రాత్రిపూట కాపలా ఉన్నా కూడా అవి పంటపై దాడి చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చే శాడు. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ కృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని పీర్లపల్లిలో జరిగిన దొంగతనాల కేసు దర్యాప్తు చేస్తుండగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్ దొంగతనం చేసినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. జిల్లాలో రెండు దొంగతనాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు రాహుల్ జులాయిగా తిరుగుతూ పాత సామాన్లు ఏరుకుని జీవించేవాడు. జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడేవాడని తెలిపారు. అతడి వద్ద నుంచి ఫోన్, బైక్, అల్యూమినియం సామాన్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని గజ్వేల్ కోర్టులో హాజరు పరిచారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోమటిబండ గ్రామంలోని పాండవ కృష్ణ ధ్యాన క్షేత్రంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధ్యానంపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్న ధ్యాన క్షేత్రం కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 'ఆపన్న హస్తం' సంస్థ అధ్యక్షుడు బాలచంద్రం, సూర్యనమస్కార బృందం అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు నర్సింలు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: సిద్దిపేట సీపీ



సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: విద్యాసంస్థల్లో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీపీ అనురాధ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ర్యాగింగ్ మన సంస్కృతి కాదని, ఇలాంటి విష సంస్కృతికి ఎవరూ పాల్పడవద్దన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల విద్య, ఉద్యోగ, భవిష్యత్‌పై ప్రభా వం చూపుతుందని తెలిపారు. ఎవరైనా ర్యా గింగ్‌కు గురైతే వెంటనే ప్రిన్సిపాల్ లేదా డయ ల్ 100కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం



బాణాల రఘు

బెజ్జంకి(సిద్దిపేట): ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవడంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండ లంలోని గుగ్గిల్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సౌజన్య కథనం మేరకు... గ్రామానికి చెందిన బాణాల స్వామికి కుమారుడు, కుమార్తెలున్నా రు. అతను డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొడుకు రఘు(22) హైదరాబాద్‌లో ఐటీఐ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. ఈనెల 21న వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహారక మందు తాగి తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

గణేశ్ లైటింగ్.. ట్రెండింగ్

దుబ్బాకలో యూత్ పేరుతో బోర్డులు



వినాయకుడికి స్వాగతం పలుకుతూ డ్యాన్స్ చేస్తున్న యువకులు

- వినాయక మండపాల వద్ద ఏర్పాటు
- ప్రారంభమైన చవితి స్వాగత ఉత్సవాలు
- ఈసారి వెయ్యికి పైగా గణేశ్ మండపాలు

ఏయ్ బిడ్డా ఇది మా అడ్డా అంటున్నారు.. దుబ్బాక మండల వినాయక మండపాల యూత్ సభ్యులు. జిల్లాలో చవితి ఉత్సవాల్లో ఏళ్ల నుంచి దుబ్బాక ప్రత్యేకతను సంతరించుకుంటూ వస్తోంది. వినూత్నంగా లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేసి, యూత్ పేరును సినిమాను తలపించేలా తీర్చిదిద్ది సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దీంతో ఆ వీడియోలు ట్రెండింగ్ అవుతున్నాయి.

దుబ్బాక టౌన్: దుబ్బాక మండల వ్యాప్తంగా ఈ సారి వెయ్యికి పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు సైతం వినాయకుల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని అవగాహన కల్పించారు.

సోషల్ మీడియాలో వైరల్

యూత్ పేరును సినిమా పేరు తలపించేలా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌ను జత చేసి సోషల్ మీడియాలో వదులున్నారు. దీంతో ఆ వీడియోలు ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్నాయి.



కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఘనంగా స్వాగత ఉత్సవాలు

వినాయక చవితి మూడు రోజుల ముందే దుబ్బాకలో స్వాగత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భారీ గణనాథులకు పుర వీధుల గుండా డీజే సౌండ్లతో, యువకుల డాన్స్‌లతో స్వాగతం పలుకుతున్నారు. ముందే ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఊరేగింపును తిలకించడానికి భారీగా ప్రజలు తరలివస్తున్నారు.

లైటింగ్ బోర్డులతో..

ప్రస్తుతం మండల వ్యాప్తంగా వినాయకులను ఏర్పాటు చేసే స్థలంలో ఇది మా యూత్ అడ్డా అని యూత్ పేరుతో లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. బోర్డులు స్థాపించే సమయంలో బాణాసంచా కాలుస్తూ..జిల్లాలో ఎక్కడ లేని విధంగా సంబురాలు జరుపుకుంటున్నారు.



యూత్ పేరుతో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

ప్రత్యేకంగా ఉండాలని..



మేము 15 ఏళ్లుగా వినాయకున్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ సంవత్సరం నిమజ్జన ఉత్సవాల్లో దుబ్బాక ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సారి స్వాగత ఉత్సవాలు కూడా ప్రత్యేకత సంతరించుకునేలా ఏర్పాట్లు చేశాం.

-నేహాల్ గౌడ్, మిత్రయూత్, దుబ్బాక

దుబ్బాక పేరు మారుమోగేలా



పోయిన సంవత్సరం మా యూత్ ఆధ్వర్యంలో 20 భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లతో నిమజ్జనం ఘనంగా నిర్వహించాం. ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేశాం. దీంతో ప్రజలందరూ ఆకర్షితులయ్యారు.

-నిఖిల్ రెడ్డి, రాక్‌స్టార్ యూత్, దుబ్బాక

హామీలు అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ

నర్సాపూర్ రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్ దారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వచ్చే నెల 9న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నా సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నెల రోజులకే వికలాంగులు, వితంతువులు, వద్ధులకు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి మర్చిపోయారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా రేవంత్ రెడ్డి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది పెన్షన్‌పై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు. కొత్తగా మరో 10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాగా అంతకుముందు బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సూరారం నర్సింలు మందకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఇన్‌చార్జి సైదులు, వికలాంగుల పోరాట సమితి అధ్యక్షుడు పాండు, కళామండలి సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే సునీతా రెడ్డి

నర్సాపూర్ రూరల్: రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చుంచెలుక పడిన నీరు తాగడంతో చిన్నారులు అస్వస్థతకు గురై నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. కాగా ఆదివారం ఎమ్మెల్యే సునీతా రెడ్డి అస్వస్థతకు గురైన పిల్లలను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు మన్సూర్, శివకుమార్, భోగ శేఖర్, పంబల భిక్షపతి, రమణ ఉన్నారు. కాగా చిన్నారులను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి పరామర్శించారు. అలాగే పిల్లలకు అందుతున్న వైద్యంపై ఆర్‌జేడీ ఝాన్సీ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను పరామర్శించిన వారిలో డీడబ్ల్యూఓ హైమావతి, ఈడీపీఓ హేమ భార్గవి, సూపర్ వైజర్ సంతోష ఉన్నారు.



చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

తిమ్మాపూర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

- ఇంటింటికీ జ్వర సర్వే
- 212 మంది నుంచి రక్త నమునాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



తిమ్మాపూర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్‌లో విష జ్వరాలతో బాధపడుతున్న ఘటనపై ఈ నెల 16న సాక్షిలో 'తిమ్మాపూర్‌లో విషజ్వరాలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజశేఖర్‌కు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 17న గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొదటి రోజు 85 మందికి రక్తనామునాలు సేకరించి, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వర సర్వే చేపట్టారు. 360 ఇళ్లలో మొత్తం 212 మంది నుంచి ఇప్పటికి వరకు రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వైద్యుడు రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో డెంగీతో చనిపోయిన మహేశ్, శ్రావణ్ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేసుకోగా డెంగీ లక్షణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో జిల్లా యంత్రాంగం, మండలంలోని వివిధ శాఖ అధికారులు స్పెషల్ డ్రై డే నిర్వహించారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, మందులు పిచికారీ చేసి, చెత్త సేకరణ చేపట్టారు. జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారం రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని, వైద్యులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా అనంత సాగర్‌లో కూడా విష జ్వరాలు విజృంభించాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు పదిహేను మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారని, ఇక్కడ కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



పూనంచంద్

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కేఎస్‌ఆర్ కాలనీకి చెందిన పూనంచంద్ స్థానికంగా అప్పులు చేశాడు. వారు తిరిగి చెల్లించమని రోజు ఫోన్ చేస్తుండటంతో ఫోన్ నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టాడు. దీంతో అప్పు ఇచ్చినవారు భార్యకు ఫోన్ చేసి తిడుతున్నారు. ఈ క్రమంలో భార్య మమత భర్తను ఎందుకు అప్పులు చేస్తున్నావని ప్రశ్నించింది. కాగా ఈనెల 18న పూనంచంద్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించ లేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు.

చెల్లింటికి వచ్చిన మహిళ..

చిన్నశంకరంపేట(మెదక్): చెల్లింటికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని చందాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... మనోహరబాద్ మండలం పరికిబండ గ్రామానికి చెందిన చింతల కవిత(40) ఈ నెల 21న చందాపూర్‌లోని తన చెల్లింటికి వచ్చింది. ఆరోజు నుంచి కన్పించకుండా పోయిందని, ఆమె మతిస్థిమితంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కవిత సోదరుడు నగేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కవిత

పటాన్ చెరులో యువకుడు..



రాజు

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన నాగులమ్మ కొడుకు రాజు ఈ నెల 21న ఉదయం తల్లి దగ్గర రూ.2 వందలు తీసుకొని బయటకు వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమారుని కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆధార్‌కార్డు ఉన్నా టికెట్ కొడతారా?

- జిరాక్స్ కాపీ కావడంతో టికెట్ కొట్టిన కండక్టర్
- జోగిపేట కంట్రోలర్‌తో మహిళ వాగ్వాదం



జోగిపేట బస్టాండ్‌లో ఆర్టీసీ కంట్రోలర్‌తో గొడవకు దిగిన మహిళ

జోగిపేట(అందోల్): మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి తన దగ్గర టికెట్‌కు డబ్బులు ఎందుకు తీసుకున్నారని ఓ మహిళ ఆర్టీసీ కంట్రోలర్‌ను నిలదీసింది. వివరాలు ఇలా... చౌటకూరు బస్‌స్టేజీ వద్ద బస్సు ఎక్కిన మహిళ జోగిపేట వరకు వెళుతున్నానని కండక్టర్‌కు తన వద్ద ఉన్న జిరాక్స్ ఆధార్‌కార్డును చూపించింది. ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా అని కండక్టర్ ప్రశ్నించడంతో నిన్న కూడా జిరాక్స్ కార్డుపైనే ఉచితంగా ప్రయాణించానని చెప్పింది. ఆధార్ జిరాక్స్ కాపీతో పాటు అప్‌డేట్ లేకపోవడంతో కండక్టర్ ఆమెకు టికెట్ కొట్టి డబ్బులు తీసుకున్నాడు. కాగా, జోగిపేట బస్టాండ్‌కు వచ్చిన తర్వాత ఆ మహిళ... ఉచిత బస్సు అని చెప్పి పైసలు వసూలు చేస్తున్నారని ఆర్టీసీ కంట్రోలర్ నాగేందర్ చారిని నిలదీసింది. ఇది ఒరిజినల్ కాదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు జారీ చేసిన ఆధార్ కార్డు అని, వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. బస్టాండ్‌లో ఇతర కండక్టర్లు కూడా చాలా సేపు నచ్చజెప్పినా ఆ మహిళ వినిపించుకోకుండా వివాదం సృష్టించింది. పలువురు ప్రయాణికులు ఆమెకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఆస్తి పంపకాల విషయంలో తగాదా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు తాగుతున్న నవీన్

సిద్దిపేటరూరల్: ఆస్తి పంపకాల విషయంలో తగాదాలు తలెత్తడంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... తోర్నాల గ్రామానికి చెందిన మేడిశెట్టి పుష్పమ్మకు ఇద్దరు కుమారులు నవీన్, శ్రవణ్ ఉన్నారు. నవీన్ ట్రాక్టర్ నడిపిస్తూ జీవనం సాగిస్తుండగా, శ్రవణ్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. అన్నదమ్ములు ఇరువురి భాగస్వామ్యంతో వరి కోత యంత్రం కొనుగోలు చేసి కొద్ది రోజులుగా నడిపిస్తున్నారు. ఇదిలా ఉండగా సంవత్సరం క్రితం వరికోత యంత్రానికి సంబంధించిన శ్రవణ్ భాగాన్ని నవీన్ కొనుగోలు చేశాడు. మరోవైపు నాటి నుంచి ఆస్తి పంపకాలు ఇతరత్రా వ్యవహారాల్లో ఇరువురి మధ్య వివాదం కొనసాగుతోంది. గొడవ చివరికి పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో ఇరువురిని పోలీసులు మందలించి మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో నవీన్ ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగే ఫొటోను, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సీఐని సాక్షి వివరణ కోరగా... ఎవరిని కొట్టలేదని, వారిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, సమస్య పరిష్కారానికి సలహాలు ఇచ్చామన్నారు. ఎవరో కావాలని తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని సీఐ తెలిపారు.

టాస్కులు చేస్తే కమీషన్ ఇస్తామని..

- నమ్మించి సైబర్ మోసం
- రూ.2 లక్షల 16 వేలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్‌ల పేరుతో ఉద్యోగిని నమ్మించి సైబర్ నేరగాళ్లు నగదును కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్ చెరు డివిజన్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈనెల 8న తన ఫోన్‌కు టాస్కులు చేస్తే కమీషన్ ఇస్తామని మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేయగా.. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఈ క్రమంలో ఉద్యోగి నగదు చెల్లించి టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్‌ను సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. బాధితుడు మొత్తం రూ.2 లక్షల 16 వేలు చెల్లించాడు. ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి బాధితుడు సైబర్ క్రైం ,పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇన్సూరెన్స్ పేరుతో రూ.లక్షా13 వేలు..

ఇన్సూరెన్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి ఈ నెల 16న హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి కాల్ వచ్చింది. పొరపాటున మీ పేరుపై బీమా ఆక్టివేట్ అయిందని.. దాన్ని కంటిన్యూ చేస్తే నగదు కట్ అవుతుందని నమ్మించి, రద్దు చేసుకోవాలని చెప్పారు. దీంతో బాధితుడు నమ్మడంతో అపరిచిత వ్యక్తి లింకును పంపించారు. లింక్ ఓపెన్ చేయగానే అతడి ఫోన్ వారి ఆధీనంలోకి వెళ్లిపోయి.. ఖాతా నుంచి రూ. లక్షా13 వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలకు భక్తి మార్గమే పరిష్కారం



మాట్లాడుతున్న స్వామీజీ తత్వదానంద మహరాజ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జీవితంలో ఎదురయ్యే అన్ని సమస్యలకు భక్తి మార్గమే పరిష్కారమని రామకృష్ణ మఠం స్వామీజీ తత్వదానంద మహరాజ్, ప్రతినిధి సూర్య ప్రకాశ్ పేర్కొన్నారు. శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి ఆలయ ఆవరణలో సత్సంగం ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదా దేవిల జీవితం, బోధనలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి రాజేశ్వర్ రావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదుకోని పెసర

భారీ వర్షాల కారణంగా పెసర పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేల పెట్టుబడులు పెట్టినా చివరకు గింజ కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. చేనులో నీరు నిలిచి పైరు మొత్తం రంగుమారి కాయలు బూజు పడుతున్నాయి. కాయలు పగిలి గింజలు చేనుపైనే మొలకెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్:

వర్షాలకు నీరు నిలిచి దెబ్బతిన్న పంట
- చేనుపైనే మొలకెత్తుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



వర్షం నీరు నిలవడంతో కుళ్లిన పెసర పంట

పత్తి, సోయాబీన్, కంది తరువాత పెసరను ఎక్కువగా రైతులు సాగు చేశారు. తక్కువ కాల పరిమితి, 50 రోజుల పంటను అంతర పంటగా కూడా సాగు చేస్తున్నారు. పెసర పంట, పచ్చిరొట్టె ఎరువులుగా నేల సారాన్ని కాపాడుతుంది. 25 శాతం ప్రొటీన్లు కలిగి ఉంటూ త్వరగా అరుగుదల ఉండే పప్పుధాన్యపు పంట. జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటలైన పెసర, మినుము,పత్తి, సోయాబీన్, కంది తదితర పంటలను రైతులు సుమారు 7.75 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పెసర సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు వేసుకున్నారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. పంట కోతకు వచ్చింది. అక్కడక్కడ పంటను కోస్తున్నారు. ఇదే సమయంలో వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో పంట తీవ్రంగా దెబ్బతింది. కొన్ని చోట్ల పంటలు నీట మునిగి గింజలు పగిలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్లపైనే గింజలు మొలకెత్తుతున్నాయి. ఎకరాకు సుమారు రూ. 15 వేల వరకు పెట్టుబడి పెట్టామని, చివరకు గింజ కూడా చేతికి రావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 60 శాతం వరకు పెసర పంట దెబ్బతిన్నట్లు తెలిసింది. వ్యవసాయ అధికారులు వర్షాలకు నీటి మునిగి దెబ్బతిన్న పంటలను గుర్తించి వివరాలు సేకరిస్తున్నారు.



చేనుపైనే మొలకెత్తుతున్న గింజలు

పంట కుళ్లిపోయింది



వర్షధార పంటగా రెండెకరాల్లో పెసర సాగు చేశా. రూ.30 వేలు ఖర్చు పెట్టాం. పంట కోతకు వచ్చే సమయంలో వర్షాలకు పొలంలో నీళ్లు నిలిచి పంట కుళ్లిపోయి పూర్తిగా దెబ్బతింది. సోయాబీన్ కూడా రంగు మారింది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– అంజిరెడ్డి, రైతు, హద్నూర్

ప్రాథమికంగా అంచనా వేస్తున్నాం



భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను ప్రాథమికంగా నివేదికలు తయారు చేస్తున్నాం. మిగతా పంటల కన్న పెసర పంటకు నష్టం జరిగింది. పంట పొలాల్లో నీరు నిలువ ఉండటం వల్ల చీడపీడల బెడద కూడా పెరుగుతుంది. వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సూచనలు, సలహాలు తీసుకొని మందులను పిచికారీ చేయాలి.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్